కథ

ఉదయం ఎనిమిదికి రైలు అనాకాపల్లి స్టేషను మెల్లగా దాటసాగింది. ''హమ్మయ్య'' అని సుబ్బారావు తృప్తిగా కాళ్లుచాచి కూర్చున్నాడు. మగతనిద్రలో ఉండగా, ఊడిపడ్డారు ఇంకా తెల్లవారక ముందే ''రాముా యిక్కడరా, సీతా యిక్కడే, అన్నా, వదినా అక్కడ సర్దుకున్నారు. అమ్మా, నాన్నా ఆ మొదటి కేబిన్‌ల్లో. సామాను ఎవది వారు చూసుకోండ్రా'' అంటూ కేకలు, హెచ్చరింతలతో అయ్యో పడుక్కున్నారు వేళ కానివేళ యిది అనే విచక్షణ లేకుండా. ''చూడండీ, యిది రిజర్వ్డు బోగీ. యిలా మీరు చొచ్చుకు వచ్చి మమ్మల్ని లేపి యిబ్బంది పెట్టడమేమీ బాగోలేదు'' అని సుబ్బారావు అన్నాడు కూడా.

# వైదికం

**- వేదుల చిన్న వేంకట చయనులు**

''క్షమించాలి. ఒక్క రెండు గంటలు ఓపిక పట్టండి బాబూ, మీకు పుణ్య ముంటుంది. ఎడ్ల బండి, బస్సు ప్రయాణాలు చేసి, రాత్రంతా జాగా రాలతో యిబ్బంది పడ్డాక యీ మెయిలు వచ్చింది. మళ్ళీ మరో నాలుగు గంటల దాకా యే రైలూ లేదుట. వెళ్లగానే గృహప్రవేశ శుభకార్యం చేసు కోవాలి, పదింటికి వర్జం రాకముందే బాబ్బాబూ'' అని వేడుకున్నాడు. పెళ్ళిపెద్దలా ఉన్న ఆయన.

సుబ్బారావు జవాబు చెప్పేలోగానే, ఆయన శ్రీమతి రుక్కమ్మ ''దానికే ముందిలెండి. నేనటు వెళ్తాను, మీరీ బెర్తు మీద, మీ ఆవిడ, ఆ అమ్మాయీ, మాతో ఆ బెర్తు మీద సర్దుకుందాం'' అని చట్టున లేచి పక్కతో సహా జరిగి, దయ చేయండి, దయచేయండి అని అనకుండానే అన్నంతటి ఘనస్వాగతం చేసింది.

పెద్దమనిషి మాట వరుసగా రెండే గంటలు అన్నాడు గాని, నాలుగు గంటలు అలా ఆరుగురే ఉండాల్సిన కంపార్టుమెంటులో సద్దుకుని పది మంది దాకా ప్రయాణం చేశారు. ఉదయం కాలకృత్యాలకి కూడా లేవడానికి వీలు లేకుండా బెర్తుల అడుగున, మధ్యనా మూటలు, పెట్టెలు, బుట్టలతో, పెళ్ళివారు అని చెప్పనవసరం లేకుండా దింపుళ్ళ బుట్టల నుంచి వచ్చే సువాసనే చెప్పింది.

కళ్ళు మూసుకునే సుబ్బారావు కూర్చున్నాడు గాని, రుక్కమ్మగారు మాత్రం హాయిగా పెళ్ళి ముచ్చట్లు వింటూ మధ్యమధ్యన ''ఆహ్హా! అంత మంది వచ్చేరేం? చాలా వైభవంగా జరిగిం దన్నమాట, అలాగా'' ఊతగా మాట కలుపుతూ, సంతోషంగా ప్రయాణం సాగుతున్నందుకు పొం గిపోతూ కూర్చున్నారు. ఎంత హడావిడిగా వచ్చారో అంతకు రెండింతలు అట్టహాసంతో, ఆదరబాదరాతో, అనకాపల్లి మరో అరగంటకు వస్తుందనగా, దువ్వాడ స్టేషను ముందు నుంచే సామానులు తలుపు దాకా మోసి తోవ కడ్డంగా కారిడార్‌లో కూడా సామానులతో, ''అట్టే సేపు ఆగదు. ఎవరి సామాను వారు చూసు గోండ్రా'' అని అందరూ అందరికీ హెచ్చరికలు చేస్తూ దిగారు.

దిగిన మరో ఐదు నిముషాలదాకా రైలు అక్కడే ఆగింది. ''వీళ్ల తొందర బంగారంగాను. ఐనా అంతమంది యెందుకూ ఓ మారుమూ పల్లెలో పెళ్లికి'' అని సుబ్బారావు ఆవిడతో అనకుండా ఉండలేకపోయాడు. ''అందరూ మీకు మల్లే సంబరమూ, ముచ్చటా, లేకుండా నన్ను ముట్టు కోకు అన్నట్టుగా ఉంటారనుకున్నారా? పెళ్లంటే అలా నలుగురూ కలిసి ఆనందిస్తేనే పెళ్లి. మనం కూడా అమ్మాయికి చెయ్యాలి రేపోమాపో. రిజిస్ట్రీ పెళ్లని అనమోకండేం? మీరూ మీ కూడికా ఆ తరువాత చూసుకుందురుగాని'' అని ఎప్పుడూ అంటించే చురకలు రెండు అంటించింది, నవ్వుతూ అన్ని పళ్లూ కనిపించేలా చాటంత ముఖంతో. పెళ్లయి పాతికేళ్లయినా, ఆ మందస్మిత వదనార విందం చూడగానే సుబ్బారావిప్పటికీ చిత్తే! అలా మెచ్చుకుంటూనే మెల్లిగా కాలకృత్యాలకి లేచాడు.

సామర్లకోట రాగానే తన వి. ఐ.పి. బ్రీఫ్‌కేస్ చేత పట్టుకుని కూలి వాడికి మిగతా పెట్టె బెడ్డింగులూ చూపించి రుక్కమ్మ ముందున తను కూలివాడి వెనకనా రైలు దిగి, అవతలి ప్లాట్ ఫారమ్ మీద ఉన్న కాకినాడ బండికి దారి తీశారు.

కూలివాడికి పైసలు యివ్వాలని పర్స్‌కోసం జేబులు వెతికి, అది బ్రీఫ్‌కేస్‌లో ఉంచిన సంగతి గుర్తు తెచ్చుకుని, దానిని తొడలో పెట్టుకున్నప్పుడు మొట్టమొదటిసారి దానిని నిశితంగా పరిశీలించాడు సుబ్బారావు.

''చచ్చేమే, రుక్కూ, లక్షలు లక్షలు పోయాయే'' అని అరిచాడు.

అందులోనే ఆవిడ పది తులాల పలకసరులు, కెంపుల నెక్లెస్సు, సుమారు మూడు లక్షల విలువగల నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్లు, ఉన్నాయని అక్కడి కక్కడే కంపార్ట్‌మెంటులో కూలబడ్డాడు.

మరో బేరము చూసుగోవడమే ఉత్తమం అని కూలివాడు మరలి పోబోతూంటే, రుక్కమ్మ ''అబ్బీ ఇదుగో బాబూ నీ కూలి'' అని చీర మడతల నుంచి చిన్న పర్సు తీశారు.

''ఆ పెళ్ళివారి సామానుతో తారుమారయిం దండీ. ఆ యెర్రగా బుర్రగా ఉన్న అబ్బాయి మన బ్రీఫ్‌కేస్ లాంటిదే పట్టుకుని దిగడం చూశాను. అనకాపల్లి వెళ్లే బండి సంగతి కనుక్కోండి'' అని నిదానంగా అంటూన్న ఆవిడని చూసి సుబ్బా రావుకి ఆశ్చర్యమే అయింది. పోయింది, పోయింది అని గొల్లు పెట్టకుండా, ఎంత నిబ్బరంగా ఉందో అని. కాని తనకి మాత్రం ధైర్యం లేక,

''నీవన్నట్లు ఆ పెళ్ళివారి దగ్గరే ఉన్నా, దాని లాకింగ్ పగుల గొట్టి, కుర్రాడి పాత బట్టలు, చిత్తుకాగితాలకి బదులు బంగారం ఉందని చూశాక, ఈ పాటికి దానిని కరిగించి, బ్రీఫ్‌కేస్‌ని చీల్చి చెత్తలోనో లేదా పత్తా లేకుండా ఏ నూతి లోనో గోతిలోనో పారేయకుండా ఉంటారనుకున్నావా? కర్మ, కర్మ'' అని సుబ్బారావు నెత్తిబాదుకున్నాడు.

''బాబూ, మరో పది నిముషాలలో యిటుంచి మెయిలు అనకాపల్లికి దొరుకుతుంది పదండి ఎల్దాం'' అన్నాడు అడుగకుండానే సలహాగా.

''పదండి. అలా అనవసరంగా వాళ్లని చెడ్డగా ఎందుకనుకోవాలి. అసలు ఇంత వరకూ తారు మారు సంగతి వాళ్లకి తెలియకనే పోవచ్చు. ఆ గృహప్రవేశ హడావిడిలో'' అని రుక్కమ్మ కూలి వాడిని ఆగమన్నాది.

''నువ్వు కూడా దేనికే! మరింత డబ్బు దండగ. అదృష్టం ఉంటే దొరుకుతుంది. నీవింటికి వెళ్ళు కాకినాడ బండిలో. నేను అనకాపల్లి వెళ్తాను గాని, ఎలా ఆ పెళ్ళి వారిని పట్టుగోవాలో ఆ పరమాత్ము డికే తెలియాలి''.

''ఆ పరమాత్ముడు నాకప్పుడే చెప్పాడు లెండి. అనకావపల్లిలో ఆ పెళ్ళివారొక్ఖరే దిగారా బండిలో. స్టేషన్ దగ్గర రిక్షావాళ్ళని అడిగితే తప్పకుండా తెలు స్తుంది వారిల్లు'' అని రుక్కమ్మ అనగా సుబ్బారావుకి భార్య తెలివితేటలకి ఒక పక్క మెప్పయినా, పొద్దున్న ఉన్న రిక్షావాళ్లే అక్కడ మళ్లీ దొరుకుతారని ఎలా అనుకో గలమనే అనుమానం రాగానే దీన ముకం అయింది.


ఆవిడ పర్సు తీసుకుని అందులో ఎంత ఉన్నదో సుబ్బారావు చూసుకున్నాడు. చిన్న పర్సేనా రెండు వందల దాకా ఉన్నది చూసి, ఆవిడకి ఒక ఐదు రూపాయలు చేతిలో పెట్టి కూలివాడితో బయలు దేరాడు.

సుబ్బారావు మెయిలు ఎక్కాడు గాని తన బ్రీఫ్‌కేస్ దొరుకుతుందన్న ఆశ లేకపోయింది. కిటికీ పక్క కారిడార్ సీట్‌లో కూర్చుని వికల మనస్సుతో వెనుకకు పారిపోతూన్న దృశ్యాలు చూస్తూ ఆలోచనలలో పడ్డాడు.

ఊరికనే తిని కూర్చోక పూరీ తీర్థయాత్ర పెట్టిన ఆవిడ మీద కోపం వచ్చింది. ఆ తరు వాత, తీర్థయాత్రకి వెళ్తూ కూడా, ఆభరణాలు తీసుకు వెళ్లాలా అని మరొక చీవాటు మొద లాడింది. ఆ వెంటనే

ఊరుకు వెళ్తూ, విలువైన సేవింగ్స్ సర్టిఫికెట్లు తీసి భద్రపరచాలన్న తన తెలివితేటలేమయ్యాయి అన్న ప్రశ్న ఎదురయింది.

విలువగల వస్తువులున్నాయి కదా! తలకింద పెట్టుకుని పడుక్కోవద్దూ? గట్టిగా రాయిలా ఉందని సూకరం పడిపోయేను. నా సూకరం మండా అని ఆత్మ నింద పెల్లుబికింది. రైలు అన్నవరం దాటుతోంది. తండ్రీ, సత్య నారాయణా, వస్తు వులు దొరికితే, నీ దర్శనం



చేసుకుని అభిషేకం చేయిస్తానని అప్పీలు పెట్టాడు.

మెయిలు అనకాపల్లి చేరేటప్పటికి సుమారు పం(డె డున్నర అయింది. (శావణ మాసపు మగ్గుటెండ భరించ శక్యము లేకుండా సతాయిస్తోంది. అక్కడ ఉన్న రిక్షావాళ్లెవరికీ పొద్దున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బండిలో దిగిన పెళ్ళివారి సంగతి తెలియదనగానే రోడ్డుపక్కనే కూలబడి కండువాతో వచ్చే దుఃఖాన్ని దిగమింగ ప్రయత్నించాడు సుబ్బారావు.

ఇంచుమించుగా మెయిలులో దిగిన వారందరూ రిక్షాలు కుదుర్చుకుని వెళ్ళిపోయారు. అప్పుడు వచ్చాడో ముసలి రిక్షావాడు. మెయిలు బేరానికి ఆతురతగా. ఈ ముసలాడికేం తెలుస్తుందిలే అని అనిపించినా, నిరుత్సాహంగానే వాడినీ అడిగాడు.

''ఆ బాబులుని దింపినానండి, ఆళ్లింటికి ఎళ్తారా?'' అని అన్న వాడి మాటలు విని, సుబ్బారావుకి మధుర సంగీతం విన్నంత సంతోషమయింది. మామూలుగా ఎంత అని బేరం చేసిచేసి ఎక్కే సుబ్బారావు, ''పద బాబూ'' అని చట్టున ఎగిరి రిక్షాలో కూర్చున్నాడు. సన్నని వీధి. నూనె కొట్ల వీధంటారు, దానిని. ఆ వీధి యిళ్లల్లో గదులు అద్దెకి తీసుకుని టోకున కొని నూనె డ్రమ్ములు, పప్పు దినుసులూ కొట్లల్లో స్టాక్ చేసుకుంటారు వర్తకులు. ఒకటి రెండు చిల్లర నూనె అమ్మకాలు కూడా అద్దెకు తీసుకున్న వీధికొట్లలో జరుగుతుందా వీధిలో. అందుకని సాధారణంగా ఆ వీధి బండ్లతో నిండి ఉండి, మరే వాహనమూ లోనికి వెళ్లే అవకాశం లేకుండా ఉంటుంది. రిక్షావాడు వీధి చివరన రిక్షా ఆపి, పదండి బాబూ అని కాలి నడకన వీధి మధ్యలో ఉన్న ఇంటికి తీసుకుని వెళ్లాడు. రిక్షావాడితో మళ్లీ ఇప్పుడే వస్తాను ఉండు అని సుబ్బారావు లోనికి అడుగులు వేశాడు.

నాలుగు మెట్లక్కగానే సన్నని నడవని దాటి వెళ్లాలి. పైకి ఏ సందడీ కనపడక, పెళ్లివారింటికే సరిగ్గా వచ్చానా అని అనుమాన పడ్డాడు.

నడవ దాటగానే లోన పెద్ద నాలుగిళ్ల వాకిలి, పెళ్లిపందిరి కనిపించి, లోన శుభకార్య తంతుగా (శావ్య ఆశీర్వాద సామం వినగానే సుబ్బారావుకి ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. వరండాలోనే అలా నిలుచుండి ఎవరేనా పైకి వచ్చినప్పుడు పెళ్లిపెద్దకి కేకవేయండని అర్థించ నిశ్చయించాడు.

ఒక ఐదు నిముషాలలా గడిచాయేమో! ఒక కుర్రవాడు వచ్చి, ఎవరు కావాలి మీకు అని అడిగాడు. పెళ్ళిపెద్ద అంటే ఆ చిన్న వాడికి అర్థమవలేదు. సుబ్బారావుకి ఆయన పేరు తెలియదాయె.

''మీ తాతగారిని పిలు బాబూ'' అని అన్నాడు. మంత్రంలా పనిచేసింది అది. తాతయ్యా, అంటూ లోనికి పరుగు తీశాడు, ఆ కుర్రవాడు.

లోనుంచి వస్తూనే, అల్లంత దూరంనుంచే ఆయన, ''అయ్యొయ్యో! తమరే వచ్చారా! చాలా (శమ అయింది, మా వల్ల మీకు, దయచేయండి బాబూ, దయచేయండి సుబ్బారావుగారూ'' అని ఆ పెద్దమనిషి లోనికి ఆహ్వానించి, ''ఏమేవ్! చూడెవరొచ్చారో!'' అని ఆవిడకు కేకవేస్తూ, చాపపరిచి కూర్చోపెట్టారు.

తిమ్మన్నా అని పిలిస్తే నా పేరు నీకెలా తెలుసని వెనకటికి ఓ పెద్దమనిషి అడిగిన సామెతలా, ఒక్క నిముషము ఆశ్చర్యమయినా, సుబ్బారావు ఆ వెంటనే తన బ్రీఫ్‌కేస్ మీద పేరూ ఎడ్రస్సూ ఉన్న లేబిల్ అంటించినది గుర్తుకొచ్చింది.

శ్రీమతి వస్తూనే, ''క్షమించండి అన్నగారూ. మా రామం తనదే అనుకుని, పొరపాటున మీ సూట్‌కేస్ పట్టుకొచ్చేశాడు. ఇంటికి వచ్చాక చూసుకుని, 'బాబోయ్, నా ప్రోజెక్ట్ కాగితాలుసున్నా అయిపోతుంది నా పరీక్ష అవి గాని పోయాయో! ఆ పెద్ద మనిషి తనది కాదని అది ఆ రైలులో వదిలేయలేదు కదా' అని గాబరా పడిపోతూ, టిఫినేనా తినకుండా, సింహాద్రికి పరుగు తీశాడు. ఈ పాటికి మీ ఇంట్లో మీది అందచేసే ఉంటాడు. వెర్రినాగన్న మళ్లీ యిటు పరుగు తీస్తాడేమో!'' అని తన ఆరాటం వ్యక్తపరుప్తూ, మీ వస్తువు క్షేమంగా ఉన్నది, బెంగవద్దని చల్లగా చెప్పిన ఆమెకు మనసులోనే ధన్యవాదాలు అర్పిస్తూ మౌనంగా నమస్కరించాడు.

''సమయానికి వచ్చారు. సంతర్పణ భోజన మారగించి వెళ్ళండి'' అని మరోమాటకి అవకాశమివ్వకుండా స్నానానికి ఒక తువ్వాలు, ఆ తరువాత కట్టుకొనడానికి పట్టుపంచా యిచ్చి, ఆదరించారు.

రామం కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడని భోజనం చేస్తూ దొరలిన కబుర్లలో తెలిసింది. తమ అమ్మాయి సరళ కూడా అదే కాలేజీలో మొదటి ఏడాదిలో ఉన్నదని సుబ్బారావు చెప్పినప్పుడు ఆ శ్రీమతికి అంత సంబరమెందుక యిందో ఆ పెళ్లిపెద్ద రామబ్రహ్మంగారికి అర్థమవలేదు.

రామం బ్రీఫ్‌కేస్ కాకినాడ పట్టుకు వెళ్లాలా లేక అక్కడే వాళ్లకి ఇచ్చి తనమానాన్న తను వెళ్లాలా అన్నది సుబ్బారావుకి తేలలేదు. ఇల్లాలు, వెంకమ్మ గారి మాట, అబ్బాయి రామం వచ్చే వరకూ ఉండి, సావకాశంగా రామం, తనూ, మరునటి రోజు వెళ్ళవచ్చు అని. అబ్బాయి రామం తిరిగి రాకుండా సుబ్బారావు గారి కోసమే అక్కడ నిరీక్షిస్తూ ఉంటాడేమో అని రామబ్రహ్మం గారి సందేహం. చివరికి సుబ్బారావుకి అది అబ్బాయికి అందచేసే పూచీ తనదిగా తట్టి, వారికి ఆ అభయమిస్తూ, బస్సులో కాకినాడకి వెళ్ళ నిశ్చయించాడు.

కాకినాడ చేరుకుని ఇంటిలో సుబ్బారావు అడుగు పెట్టేసరికి చీకటి పడిపోయింది. లోనుంచి టి.వి. సీరియల్ ప్రోగ్రామ్ వినవచ్చింది. లక్షలు లక్షలు పోయినా చీకూ చింతా లేనట్లు ఆ టి.వీ. ఎలా చూస్తు న్నారు తల్లీ కూతుళ్లు అని సుబ్బారావుకి ఆశ్చర్య మయింది. ఏమేవ్ అని కేకశాడు. తీసే ఉంది. ఆ గావుకేక దేనికీ, అని ఇల్లాలు సీరియల్ విడిచి రానం దుకు ఉక్రోషమయింది. అబ్బాయి వచ్చి చల్ల కబురీ పాటికి చెప్పే ఉంటాడని తట్టి తన ప్రథమ కోపానికి తనే నొచ్చుకుంటూ లోనికి తేలికగా అడుగులు వేశాడు.

పలకసరులతో పళ్లన్నీ కనిపించేలా నవ్వుతూన్న ఆవిడని చూసి యథావిధిగా చిత్తయిపోయి సంబరంగా, ''చాలా మంచి వాళ్లే. ఏం మర్యాద చేశారు? సంతర్పణ భోజనం చేస్తూ నిన్నే తలచుకున్నారనుకో. నువ్వు కూడా వచ్చి ఉంటే కబుర్లతో వాళ్ళని నీ చిరునవ్వుతో చిత్తు చేసి పారేసి ఉండే దానివని'' అని ఆ మరుక్షణమే, ''ఆ అబ్బాయి గాని అనకాపల్లి తిరిగి వెళ్ళిపోలేదు గదా! రోజల్లా తిరుగుడులోనే అయింది పాపం, అతగాడికి!'' అని తను తెచ్చిన బ్రీఫ్‌కేస్‌తో సహా సోఫాలో చతికిలబడ్డాడు.

''నేను రేపు కాలేజీకి పట్టుకు వస్తాను. మా నాన్నగారు మీకా శ్రమయివ్వకుండా తప్పక పట్టుకు వస్తారు. అంతకీ కాకపోతే రేపు వెళ్దురుగాని అని చెప్పాను నాన్నా. అలాగే అని హాస్టల్‌కి వెళ్ళిపోయాడు'' అంది సరళ.

''చాలా బుద్ధిమంతుడబ్బాయి. కాలేజీ డిబేట్‌లో ఫస్ట్ వచ్చాడని సరళ చెప్పింది. అతనేమో చాలా బాగా పాడింది మీ అమ్మాయి మా ఫ్రెషర్స్‌డే ఫంక్షన్లో అని అబ్బాయి, ఒకరినొకరు మెచ్చుకుని మురిసి పోయారు కూడా!''అని రుక్కమ్మ చెప్పగా మొత్తా నికి రోజు సుఖాంతంగా అయినందుకు సుబ్బారావు అన్న వరం సత్యనారాయణ స్వామికి ధన్యవాదాలర్పించు కున్నాడు.

***

మరుసంవత్సర శ్రావణమాసంలో, అందరూ అన్న వరం కొండమీద, సరళ, రామంల వివాహానికి సమావేశమయ్యారు.

